
# మోసం



"లాభం లేందే ఏ పనీ సెయ్యిమోక. ఆశ పడాల; మోసం సెయ్యాల. ఆశా, మోసం—ఈ రెండూ లేందే పేదోడు జీవించ లేడు. ఊళ్ళో పెద్ద సవుద్రం వుంది. ఐనా తాగడాన్కి నీళ్ళు పంజెయ్యవ్. అలాగే వూర్నిండా లష్చలకిలష్చలు సొమ్ముంది. అది పేదోడి కడుపుకి పంజెయ్యదు, పేదోడి దాహం తీర్చదు. పేదోడికి కూడెట్టదు. గొప్పోడు మోసంసేసి మిద్దిలు కడతాడు, అదే మోసం పేదోడు సేసి పొట్టనింపుకుంటాడు. అంచేత మోసం సెయ్యాల. ఆడి జుట్టు ఈడికీ, ఈడి జుట్టు ఆడికీ ముడెట్టాల. మతలబు సెయ్యాల. అప్పుడే మనిషిలా మనగలవ్. అప్పుడే పెద్దిం టోడు కూడా నీ సుట్టూతా తిరుగుతాడు. నీకు సెయ్యొత్తి దండాలెడతాడు!" చిన్నప్పుడు సింహాచలానికి బ్రతుకు తెరువు నేర్పుతూ, జీవితంలో ఢక్కామక్కీలు తిన్న ముసలి తండ్రి నేర్పిన పాఠమది!

"యెల్లు బాబూ, యెల్లు. గేటు గుమ్మం సప్పుడు కానీమోక. సప్పుడైతే కుక్కలు మీద పడి కరుస్తయ్. బంట్రోతులు మీదకొచ్చి సంపేస్తారు. జాగరత్త నాయనా. లోపలి కంటా సక్కా యెళ్ళి, అంకిందట్టుకొచ్చీ! ఆనక అదురుష్టం బాగోక, జెమాన్ల సేతుల్లో సిక్కడి నావంటే సితక బొడిసేస్తారు. అప్పుడు మాత్తరం నా దగ్గరకి రామోక. నిన్ను డొక్కలో తాప్తుంతుంటే నాకూ యేడుపే. ఐనా ఏటిసేస్తాం? ఈ డొక్కలో పేగులుపెట్టే బాధ తీరుచుకోవాల. గొంతు తడుపుకోవాల. పేదోళ్ళం. కూటికి సెడ్డోళ్ళం. ఇంతకంటె మరేం సెయ్యలేం. యెళ్ళు నాయనా, యెళ్ళి పోచ్చెయ్!" ఇంకా చిన్నప్పుడు, కూటికోసం కన్నతల్లి దగ్గిరుండి నేర్పిన 'విద్య' అది! అప్పుడు, మాసికలేసిన 'లాగూ' తో, చింపిరి జుట్టుతో, భయంభయంగా ఎందరిళ్ళల్లోకో అమాయకంగా చూస్తూ వెళ్ళేవాడు సింహాచలం. గడియారాలూ, అద్దాలూ, సిల్కుచీరలూ, చొక్కాలూ, వెండి పళ్ళాలూ, గరిట్లూ, గ్లాసులూ—ఒక్కటేవిటి, చేతికి అందినవన్నీ చుట్టుకొచ్చి, వీధి మొగలో వేచి ఉండే కన్న తల్లి వడిలో చేర్చేవాడు. కొన్ని సందర్భాలలో దొరికి పోయినప్పుడు రోడ్డుమీద వెళ్ళే ప్రతి మగాడూ, కుర్రాడని కూడా చూడకుండా చిత్ర వధ చేసేవాడు. ఒకడు వీపు దద్దుర్లొచ్చేట్టు చావబాదేవాడు. మరొకడు చెంపలు రెండూ చిట్లి పోయేట్టు వాయించేసేవాడు. ఇంకోడు చేతిలో బీడీతో తొడలు కాల్చేసేవోడు. ఎండలో మాడి పోతున్న తార్రోడుమీద దొర్లించే వాడింకోడు. అన్నిటినీ అలాగే సహిస్తూండేవాడే కాని, ఎదురుగానే ఉన్న తల్లిని మాత్రం నోరువిప్పి 'అమ్మా!' అని పిలిచేవాడు కాదు. 'ఆ సమయాన ఆమె తన తల్లిగా గుర్తించబడకూడదు. తను ఆ తల్లి తాలూకు కొడుకుగా నలుగురి దృష్టిలోనూ పడకూడదు.' ఎలాగూ నాలుగు తాపులు తన్ని వదిలేస్తారనే ధైర్యం ఉంది. అందుకే ఆ తాపుల్నీ, హింసనూ మౌనంగా భరించేవాడు. అలా చేయడంలో తర్ఫీదిచ్చిన తల్లి మాత్రం నోట్లో చెంగు కుక్కుకుని, కన్నకొడుకుని తనమూలంగా చిత్రవధచేస్తున్న జనాన్ని తిట్టుకుంటూ, నిస్సహాయంగా ఏడుస్తూ కూర్చునేది. ఏ స్థంభానికో వేసి కొడుకుని కట్టేసి జనమంతా వెళ్ళిపోయేక, వాణ్ణి గుండెల కదుముకుని బావురుమనేది. అయినా, మర్నాడు మామూలే! దినదినమూ గండాల్ని ఎదుర్కొంటూ తల్లి చెప్పుచేతల్లో అలాగే పెరుగుతూ వచ్చేడు సింహాచలం.

బ్రతుకు తెరువుకోసం ఉగ్గుపాల్తతోనే తల్లి నేర్పిన విద్యలూ, తండ్రి బోధించిన పాఠాలూ బాగా ఆకళింపు జేసుకున్నాడు సింహాచలం. ఈ అనుభవాలు కొన్ని కొత్త చిట్కాలను కూడా నేర్పడంతో, అవతలి వాడెంతటి వాడైనా, ఇట్టే వాణ్ణి మాపేయగల చాకచక్యాన్నీ, చాతుర్యాన్నీ సంపాదించ గలిగేడు. అటువంటి నేర్పరిదనంతోనే పెద్దవాళ్ళ ప్రాపకాన్నికూడా పొందగలిగేడు, అందుచేతనే ఈనాడు సింహాచలం పెద్ద తరహా వ్యవహారకర్త. ఆ చుట్టు ప్రక్కల జనం సింహాచలాన్ని సంప్రదించకుండా ఏ శుభ కార్యాలూ తలబెటరు. 'లేబరు' క్లాసుకీ, అలగా జనాలకీ సింహాచలం మాట వేదవాక్కు. వాళ్ళపాలిట నాయకుడు 'సింహాచలం మారాజు!' వాళ్ళగోడు విని, వాళ్ళ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే, వాళ్ళ పెన్నిధి 'సింవాచలం బాబు.' కారుల్లో తిరిగే 'డాకటేరు బాబులకీ,' కాలేజీల్లో పాఠాలుచెప్పే 'లెచ్చరేరు బాబు'లకీ వాడిగ్గా కిరాణాసామాన్లూ, కాయగూరలూ అరువిచ్చే 'జన్రల్ మర్చెంటు

అందే గోపాలకృష్ణమూర్తి



సింహాచెలమ్.' ఎండలో తిరిగి తిరిగి అలిసిపోయి, దాహంతో గొంతు ఆరిపోయిన బాటసారులకు చల్లని మంచి తీర్థం ఉచితంగా అన్నివేళలా అందజేసే 'సల్లని ధరమదాత' సింహాచలం. ఫారిన్‌స్టఫ్‌తో షోగ్గా మొదలెట్టి, ఆనక ఆరిపోయి, అవసరార్థం నాటుమందు లెవెల్‌కి దిగిపోయిన 'పతాసుబాబు'లకి చవకలోనే సంతృప్తిని కలిగించే వీరుడు సింహాచలం. 'ఏమోయ్, ఊర్కో ధరకీ, నీ దగ్గర ధరకీ ముప్పావలా తేడావుంది, ఏం, కొట్టు మూయించేసెయ్యాలా?' అని పైరైపోతూ వచ్చే హైక్లాసు అమ్మగోర్లనీ, బాబుగోర్లనీ 'ఏదో బతికి సెడ్డోడ్ని. ఇదంతా తఁవరి భిచ్చే. తఁవలాటోరిది ఓ అణా డబ్బులు నాలోటోడు తినపోతే ఎవరు తింటారమ్మా. తఁవరంత కోప్పడిపోతే నాబోటోడు ఎలా బతగ్గలడు. యిదంత తఁవరిదయే....!' అంటూ నిముషాల్లో బోల్తా కొట్టించి, వాళ్ళ అభిమానాన్ని రెట్టింపు చేసుకోగల మాటకారి సింవాచలం. ఆస్పత్రిలో దిక్కుమాలిన చావు చచ్చినోళ్ళ శవాలకోసం, చందాలు దండి, దగ్గరుండి దహన సంస్కారాలు చేయించే 'సంస్కర్త' సింవాచలం. దిక్కులేనోళ్ళందరి చేతా 'మాబోటోరికెవరున్నారు? పైన భగమంతుడున్నాడో లేదో తెల్దుగాని, భూమ్మీద మాత్రం మా పెద్ద దిక్కు సింవాచెలంబాబే!' అని అన్పించుకున్న ఘనుడు, దిట్ట సింహాచలం.

"ఇచ్చట అన్నివేళలా ఉచితముగా మంచినీరు ఈయబడును. చలివేంద్రం - ప్రొప్రయిటరు: సింహాచలం" అన్నబోర్డు మీది ట్యూబ్ లైటు వెలిగించి, అరచేతిలో శ్రీకారం చుట్టుకొని కళ్ళకద్దుకున్నాడు సింహాచలం. ఆనక మనసులో దైవనామస్మరణ చేసుకుని, "నూకాలూ!" అని పిల్చేడు. మొదటి పిలుపుకి నూకాలు పలకలేదు. రెండో పిలుపుకి, "సీరె మారుసుకొంటున్నా. యేటలా కేకలెడతావ్?" అని లోపల్నుంచే కోప్పడింది. కాస్పేపటికి సింహాచలం పక్కన ప్రత్యక్షమైంది నూకాలు. గుప్పుమన్న సువాసన ముక్కుపుటాలకు తగలడంతోనే మత్తుగా కళ్ళుమూసుకొని, మళ్ళీ తెర్చి, "సాష్చాత్తూ లక్ష్మిదేవి లాగున్నావే నూకాలూ;" అంటూ మీదకు లాక్కోబోయేడు సింహాచలం.

"రోడ్డుమీద కూసుని యేటీ యికసెక్కాలు? ఆఁ...." అంటూ విదిలించుకుంది నూకాలు.

"అది కాదే నూకాలూ, ఓ సక్కటి కబురుసెప్తా. ఇంటావా?"

"మళ్ళీ ఓర్ని మాపీడాన్కి? పెద్ద మడిసిలా కబుర్లాడుతూ ఆణ్ణీ యీణ్ణీ ఆర్పేడమే కదా నీ పని! నీ యెవ్వారం నాకు తెల్దేటి?—"

"యేటి నూకాలూ, నేనేటి సేసినా నీకోసరమే కదా. రేపు నేను కవున్సిలేరైనా, మునిసిపాల్టీ సెయిర్మేనైనా, అయిద్రాబాదులో మినిస్టెరైనా నీ కోసమే కదా!"

"అవునవును-అంతా నా కోసరమే. నేనే నిన్నీ పాడుపన్లు సెయ్యమన్నాను. శెవాల్ని తగలెట్టేందుకు బజార్లో డబ్బుదండి, అందులో సగం పెట్టి నాకు సీరెలూ, రయికలూ ఒట్టుకురమ్మంటా నేనే! కూరల్లో సచ్చులూ-పుచ్చులూ కలిపేసి, రెట్టింపు ధరకమ్మేసి సొమ్ముల్చేసుకోమన్నాన్నేనే! అలగా వోళ్ళందర్నీ ఓ దరికి జేరిచి, ఆళ్ళకి అరువొప్పుకుని సారామిప్పి,

దొంగలెక్కల్జూపి, డబ్బు కాజేయమన్నాన్నేనే! సలివేంద్రం బోరుదెట్టి సారాదుకాణం నడప మన్నదీ నేనే! యీ దొంగ సొమ్మంతా నా కోసరమే; యిక రేపొద్దుట కవున్సిలేరువో, మినిస్టేరువో అవ్వాలి, నేను యింకా సుఖపడి పోవాలి! సాల్లేవూరుకో, యీ సంబడం సాలు! కల్లో గెంజో ఉన్నకాడికి తాగి సక్కావూరుకో—" సింహాచలం చేస్తున్న వ్యాపారం తాలూకూ, అరమరికలూ, లోగుట్లూ ఏ కరువు పెట్టసాగింది నూకాలు.

"ఊరుకోయేస్, ఈ మాయ ప్రెపంచకంలో గవురవంగా బతకాలంటే మోసం సెయ్యాల. దానికీ తెలివి తేటలుండాల, ధైర్యవుండాల, మొగతనం వుండాల, శాకసెక్యం వుండాల, శావుండాల. ఆయన్నీ నాకు బగమంతుడే ప్రసాదించేడు. అందుకే, సిన్నప్పుడు రోడ్డుమీద జనాల్తో తాపుల్తిన్న నేను యిప్పుడదే రోడ్డుమీద జనాల్తో దండాలెట్టించుకుంటున్నాను. రేపు సెయిర్మేనైతే దండలేసూ రేగిస్తారదే జనం! సూడు నూకాలూ నా తడాఖా! రేపు కవున్సిలేరు యెలకషనొస్తంది; బుల్నాయుడుగోరూ, ప్లీడరుబాబుగోరూ, కలట్రాఫీసు రాజుగోరూ—యీరంతా నన్ను నిలబడమని సపోరుటిస్తన్నారు. మన దుకాణానికొస్తన్న జనం మన కెయ్యకపోతే యింకెవరికేస్తారు? ఆళ్ళందరినీ ఓపాలి సారాలో ముంచెత్తేస్తా. అంతే—'నువ్వే సింవాచెలం నువ్వే మా కవున్సిలేరువి, నువ్వే మా సేర్మేన్‌వి' అని దండాలెట్టేస్తారు! నీ కింకేటి డవుటు? మునిసిపాలిటీ వోళ్ళ నీళ్ళ లారీ నీ గుమ్మంకాడ ఆగుద్ది. నీ యింటి సుట్టూ సిమెంటురోడ్డు మూడుపూటల్లో పడిపోద్ది. వూర్లో పెద్ద మనుషులంతా నీ యింటి సుట్టూ, నీ ఆయన కోసం కారులూ, టేక్సీలూ యేసుకు యెగబడతారు. మీటింగులంటారు, సనమానాలంటారు, వుపన్యాసకాలంటారు, టీ పారిటీలంటారు, ఆడికీ ఈడికీ వుజ్జోగా లెయ్యించిమంటారు, ధరమాసుపత్రి బాగుసెయ్యంచమంటారు, ఆళ్ళింటి దగ్గర కుళాయెట్టించమంటారు, ఒకటేటి యెన్ని పనులో, యెంత గలభాయో! కంట్రాట్టర్లు కట్టలు కట్టలుచ్చుకుని నీ సుట్టూతా తిరుగుతారు. యేటి సెప్పన్నూకాలూ, లష్చలకి లష్చలు.... సేర్మేన్నవనీ....నిన్ను బంగారంలో ముంచేస్తా...." భవిష్యత్తును గురించి కలలు కంటూ ఏదేదో చెప్పుకుపోయాడు సింహాచలం.

"మోసం సేసి యెవడూ బాగుపడ్డేడు. యేటిసేస్తావో యేటో!...." నసుగుతూ లోపలి కెళ్ళిపోయింది నూకాలు.

* *

'పి. పీ. రాజ్ & కో'- వైన్ మర్చెంట్: ఇచ్చట అన్ని వేళలా విస్కీ, బ్రాందీ, జిన్ను, రమ్ము వగైరాలు సరసమైన ధరలకు లభించును" అనే పెద్ద రంగుల బోర్డుమీద రంగురంగుల బల్బులు ఎన్నో అందంగా వెలుగుతున్నయ్. అడపాదడపా కార్లూ, ఆటోరిక్షాలూ ఐదారు నిముషాలు ఆగి ముందుకు దూసుకుపోతున్నయ్.

'పి. పీ. రాజ్ & కో'—వైన్ షాపు ప్రొప్రయిటర్ పి. పైడ్రాజు కుడిచేతి మధ్య వేలికీ, ఉంగరం వేలికీ మధ్య స్టేటెక్స్‌ప్రెస్ సిగరెట్ పెట్టి, గట్టిగా దమ్ములాగి రింగులు రింగులుగా పొగ వదుల్తూ "పార్టనర్!" అన్నాడు.

"యస్, బాస్!" అన్నాడు ట్రిప్లెక్స్ 'రమ్ము' బాటిల్ ఓపెన్‌చేస్తున్న 'పార్టనర్.' 'పార్టనర్' పేరు 'మరియాదాసు.' పెద్ద సర్కిల్స్‌లో 'మిస్టర్ దాస్.' ఒకానొకప్పుడు కాలేజీ హాస్టల్స్ దగ్గర రాత్రుళ్ళు బడ్డీ దుకాణం పెట్టి బజ్జీలూ, పకోడీలూ, కాఫీ, టీలూ అమ్ముకుని బ్రతికే పైడ్రాజు ఈ నాడు 'పీ. పీ. రాజ్'గా మారి, ఇంగ్లీషు సినేమా జంక్షన్‌లో హైక్లాసోరికి కావల్సిన 'హాట్‌డ్రింక్స్' వ్యాపారం చేయగల్గిన సమర్థుడు కాగలిగాడంటే అదంతా 'దాస్' సహాయ సహకారాల వలననేనని పైడ్రాజు జీవిత చరిత్ర తెల్సిన అందరూ అంటుంటారు. అప్పుడు 'రాజ్' కాఫీలు కల్పుతుంటే 'దాస్' చకచకా కప్పులు తొల్చి రెడీ చేస్తుండేవాడు. బజ్జీలు వేస్తుంటే పొయ్యి రాజేస్తూండేవాడు. ఇప్పుడు 'పి.పీ.రాజ్ & కో' తాలూకు అన్ని వ్యవహారాలూ 'దాస్' చేతిమీదుగానే నడుస్తున్నయ్. ఊళ్లో ఉన్న రెండు మూడు పెద్దతరహా క్లబ్‌లకూ, హోటల్స్‌కూ 'హాట్‌డ్రింక్స్' కంట్రాక్టు దాస్ పనితనంవల్లనే లభించిందన్న గట్టి నమ్మకం 'పైడ్రాజ్' కుంది. అందుకనే దాస్‌ను పూర్తిగా నమ్ముతాడు 'రాజ్'. దాస్ చెప్పిన దాన్ని ఏ పరిస్థితిలోనూ కాదనడు.


"వాట్ బాస్? సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్?" అడిగాడు దాస్.

"మన వార్డులో దట్ రోగ్ సింహాచలమ్ గాడు మనకు పోటీగా నించుంటాడని విన్నా. నిజమేనా?"

"సిల్లీ ఫెలో. వాడా? వాడిది గుండా, చెరువా? దొంగ సారా వ్యాపారం చేసే వాడా మనకి ఎగినిస్టు? రాస్కెల్, వాడి కల్లుపాక మీద 'రమ్మే'సి కాల్పించేస్తా. వాడి దుకాణం అరగంటలో మూయించేస్తా. వాడి పెళ్ళం—అదేలే-కీప్-దాన్ని పబ్లిక్కున వేలం వేసేస్తా; నువ్వు 'ఊఁ' అను బాస్, దాన్నెత్తుకొచ్చి నీ కాళ్ళదగ్గిర పడేస్తా!...." మందు ఊపులో లేచి పోయేడు దాస్.

"ఉష్! అదెవడిక్కావాలి, సెకెండ్‌హాండ్ సరుకు! కౌన్సిలర్ ఎలక్షన్‌లో దట్ బ్లడీబగ్గర్ మనకడ్డు రాకూడదు. ఎంత డబ్బైనా సరే వాడికి పారేద్దాం—"

"నో బాస్. యు ఆర్ రాంగ్. వాడిక్కాదు, వాడ్నినాయకుడుగా భావించే డర్టీ లేబర్‌గాళ్ళ-ఆళ్ళే—తోటీలూ, రిక్షావోళ్ళూ, బడ్డీకొట్టోళ్ళూ, రెల్లివీధి అలగావోళ్ళూ, జాలరిపేట జనం—ఈ స్టఫ్ అంతా ఆడి మాటని వేదవాక్కులా పాటిస్తారు. ఆడికి చెయ్యెత్తి దణ్ణాలెడ్తారు. ఎందుకంటావ్, ఆడు కొట్లో కూరలరువిస్తాడు. మందు అరువుకి పోస్తాడు, దిక్కులేని శవాల్ని మోసుకెళ్ళి మరీ కాల్పిస్తాడు, వీటన్నిటికంటె మించి ఆడి పెళ్ళాం ఆ జెంక్షన్‌కి గొప్ప అట్రాక్షను! ముండ, సోగ్గాకోక్కట్టి, కళ్ళక్కాటుకెట్టి కొట్టు మీద కూచుందంటే జంక్షన్‌లో అన్నీ ఏక్సిడెంట్లే! అది నోరుతెరిచి వోటడిగిందంటే, ఇక తిరుగులేదు. గొప్ప ఫిగర్లే. మనం సినిమా తీస్తే దానికి హీరోయినిచ్చేయ్యొచ్చు!...."



"దాస్!"

"యస్ బాస్!"

"మందు పట్టులో ఆడదాన్ని గురించి ఎక్కువ మాట్లాడుతున్నావ్. మనక్కావల్సింది అది కాదు, ఎలక్షన్లో నెగ్గడం. ఆనక వీలుంటే చైర్మన్ గిరీని చేబట్టడం. ఎంత డబ్బైనా సరే—డోంట్ వర్రీ! డాక్టర్ రావ్ దగ్గర బ్లాక్-మనీ లక్షన్నరపైగా మూలుగుతోంది. మన వైన్ షాపులో లాభాలొచ్చినా, రాకపోయినా, విపరీతమైన ప్రాఫిట్ చూపి, మేజర్ వాటా రావ్ కిస్తున్నట్టు కాగితాలు తయారుచేయడం మన పని. అదీగాక ఊళ్ళో ఎవడికో లాటరీ టిక్కెట్టు మీద ఎనభై వేలొచ్చినయ్యట. ఆ టిక్కెట్టును రావు తొంభై వేలక్కొనేసి, లాటరీలో మనీ వచ్చినట్టుగా పబ్లిక్కున ఎనభై వేలు ఖర్చు పెట్టుకొనే ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఏర్పాటుకి వెనుక బుర్ర మనది! అంచేత డాక్టర్ రావు మనమాట కాదనడు. మన మడిగిన డబ్బు లేదనడు. హై సర్కిల్స్‌లో డాక్టర్ రావుకున్న పలుకుబడి నీకు తెలీందేముంది? ఊళ్ళో లేబరంతా ఒకటైనా, హై క్లాసోళ్ళు మనవైపుంటే చాలు! అదీకాక, వుయ్ విల్ త్రో టెనర్స్! ఓటుకి పదీ—లేదా—పదిహేను! రెడీకేష్! ప్రజల డబ్బు ప్రజల వోట్లకే పారేద్దాం. ఆనక దానికి పదింతలు ప్రజలమీదే సంపాదిద్దాం. ఇదే ప్రజాస్వామ్యంలో నాయకులకుండే ఎడ్వాంటేజ్!"

"ఔను బాస్, చదూకున్న ఏ వెధవా ఆ కిరాణా కొట్టోడికి వోటెయ్యడు!"

"అలాగని బ్రాందీ కొట్టోడికి వేస్తారా?" ఎదురు ప్రశ్న వేసేడు పైడ్రాజ్.

"బాస్, వాడు సారాకొట్టోడు. మనం వైన్ మర్చెంట్సు. పోటీలో వాడూ, మనం. అంతే! జనం సచ్చినట్టు ఎవడోక్క ఓడికి వోటేసి తీరాలి! వాడికేస్తారా, మనకేస్తారా? మనకే! ఎందుకంటే—ఓ చిన్న కచ్చెపుతా విను! ఓ సద్బ్రాహ్మణుడి కుమార్తె ఓ తెల్లారుఝూమున వాళ్ళ నాన్నారి దగ్గరికొచ్చి 'నాన్నా, లేచిపోతన్నాను!' అందట. కంగారుపడ్డాడట నాన్న. "ఐతే, ఛాయెస్ నీదే నాన్నా, చాకలాడితో లేచిపోనా, సాయిబుతో లేచిపోనా? నీ యిష్టం, చెప్పు నాన్నా. ఆలోచించి చెప్పు. లేచిపోవడం మాత్రం ఖాయం!"అని రెస్పాన్సిబిలిటీని కన్నతండ్రి మీదే వదిలేసిందిట. గుటకలు మింగుతూ కన్నతండ్రి 'పోన్లే అమ్మా, అలానే కానీ, తప్పదంటున్నావు గనక చాకలాడితోనే లేచిపో, కనీసం వాడు హిందువుడు!' అని ఎంతో విశాల హృదయంతో సలహా ఇచ్చాడుట! అలాగా, వేస్తే మనకెయ్యాలి, లేదా వాడికెయ్యాలి, ఛాయెస్ బాగా లిమిటెడ్! ...."

"దాస్, ఇంతకీ నన్ను చాకలాడంటావా, సాయిబ్బంటావా?...." కోపంగా అడిగాడు పైడ్రాజు.

"బెబ్బెబ్బెబ్బే—బాస్! నిన్నేం అనటం లేదు. వాడే చాకలి, వాడే సాయిబ్బు—"

"ఐతే ఓట్లు వాడికేనా?...."

"నో బాస్, ఆ కథలాగా, వాడికీ మనకీ పోటీ వస్తే, జనం మనకే ఓటిస్తారు! ష్యూర్...." అంటూ గ్లాసు గడగడలాడించేసేడు దాస్.

"మిగతా వార్డుల్లో పేరున్న వెధవలెవరైనా కౌన్సిలర్‌గా నుంచుంటే వెళ్ళి వాళ్ళు మన వాళ్ళని చెప్పి, డబ్బు ముట్ట జెప్పివచ్చే బాధ్యత డాక్టర్ రావ్‌కి అప్పగిద్దాం. మన వార్డులో లేబర్‌గాళ్ళకు డబ్బు అందే బాధ్యత నీది!.... ఓ. కే?...."

"యస్-బాస్" అన్నాడు దాస్ వినయంగా, గ్లాసుని మళ్ళీ రమ్ముతో నింపుతూ.

*    *




సింహాచలం చలివేంద్రం-కమ్-మందుకొట్టు ముందు పెద్దవేదిక వెలసింది. రంగు కాయితాలు, పూలు రెపరెపలాడేయి. బల్లచెక్కలూ, చాపలూ ఎన్నో అక్కడ అమర్చబడ్డాయి. బల్బులూ, ట్యూబ్‌లైట్లకు కొరతే లేకుండా పోయింది.

కాపు సారా కాల్వలై ప్రవహించింది. కార్మిక జనం సెలవలు పెట్టి, పనిగట్టుకొచ్చి పీకమొయ్యా తాగి, 'సింవాచెలానికీ జై!' అంటూ నినాదాలు చేసేరు. గోడల్నిండా సింహాచలం పేరు రకరకాల అక్షరాల్తో పెయింటు చేసేరు. రంగుల బోర్డులు తగిలించేరు. రిక్షా వాళ్ళలో ఎంతోమంది సైకిల్ రిక్షాల్నిండా సింహాచలం పార్టీ గుర్తు తగిలించి సంబర పడ్డారు. ఎలక్షను సందడో ఏమో, ఆ వీధిలో నీళ్లలేని కొరత సింహాచెలం 'సారా' తీర్చేసింది. 'టీ' నీళ్ళంటే ఏవిటో మరచిపోయేరు లేబరుజనం. ఎటు చూసినా, ఎక్కడ చూసినా 'మందు', 'మందు', 'మందే!'

"ఆంధ్ర ప్రెభుత్వం మనకు కల్పించిన కొత్త ప్రాథమిక హక్కును ఎలా అమలు పరుస్తున్నానో చూడండి!..." అంటూ సర్కారోళ్ళను వేదికెక్కి వేయినోళ్ళ కొనియాడేడు సింవాచెలం. ఇంగ్లీషులో మాట్లాడమని కొందరు కుర్రాళ్లు కోరేరు.

"నేను సదూకోలేదు. అంతమాత్రాన మినిష్టరు గిరీకి గానీ, సైర్మెన్ గిరీకి గానీ పనికి రానని యెవరూ అన్లేరు. అయినా నాకు ఇంగిలీషు భాష గొప్పతనం తెలుసు.మన తెలుగోడికి తెల్గు దేశంలోనే కూడెట్టంలేదు బియ్యేసదువు. యిన్నాళ్ళూ బైటికిపోతే నా లు గు రా ళ్ళు పారేసేవోరెవరైనా. ఇప్పుడు బియ్యేలూ, యెమ్మేలూ తెలుగుభాసలో సదూకుంటే బతుకు తెరువు కష్టం. తెలుగులో బియ్యే సదివినోడు బొంబాయీ, ఢిల్లీ పోయి వుజ్జోగం సెయ్య లేడు. ఉన్న వూళ్ళో ఆడికి ఉజ్జోగం ఎలాగూ లేదు. అంచేత మినిస్టీరు హోదా దాకా పోయిన రోజున ఈ పాయింటు పారలమెంటులో మాటాడి, మార్పుకోసం కష్టపడతా. దానికి మీ దయుండాల. మీ వోటు నాకెయ్యాల!...." ఉపన్యాసం ఇస్తూ కాలేజీ కుర్రోళ్ళచేత చప్పట్లు కొట్టించేడు సింహాచెలం.

ఇంకా కాల్వలు తవ్విస్తాననీ, కుళాయి లెయ్యిస్తాననీ, ఆస్పత్రి గురించి సర్కారోళ్ళకి కాయితం పెడ్తాననీ, తారోడ్లెయ్యిస్తాననీ, బస్టేంటు బాగుచెయిస్తాననీ, ఎన్నో రకరకాల హామీ లిచ్చేడు సింహాచెలం.

చప్పట్లతో, ఈలలతో, పెద్ద పెద్ద కేకలతో జంక్షనన్నీ హడావుడితో నిండిపోయినయ్. లేబర్ పార్టీ నాయకుడు సింహాచెలం అన్నారంతా.

"కిరాణా కొట్టాడు కవున్సిలరా?" అని చిరాకు పడ్డారు కొందరు. "ఈవేళ కవున్సిలే రౌతాడు, రేపు సేర్మెనౌతాడు, ఆనక ఎంపీ అవుతాడు, రేఖవుంటే మినిష్టరవుతాడు— యీటన్నిటికీ సదుంకోవాలేటి?" అని ఎదురు ప్రశ్నేసేరు సింహాచలం అనుయాయులు.

"అందుకునే మన కుర్రాళ్ళ చదువులిలా గేడుస్తున్నయ్!" సర్కారోళ్లు గడీగడీకీ— తుగ్లక్ ప్రభుత్వపు చేష్టల్లా మార్చిపారేస్తున్న విద్యావిధానాన్ని ఈసడించుకొంటూ 'చదువు విలువ తెలీని వారంతా శాసనాలు చేస్తుంటే ఇలాగే ఉంటుంది మరి!' అని నిస్సహాయంగా నిట్టూర్పులు విడిచేరు మరికొందరు.

మొత్తానికి ఎలక్షను సంరంభం ఉధృతమైపోయింది. వచ్చే మనిషీ, పోయే మనిషి; ఎత్తే గ్లాసూ, దింపేగ్లాసూ — వినయంగా చేతులు జోడించి నిల్చున్న సింహాచలం; మందు మైకంలో జేజేలు కొడుతున్న అలగా జనం!.... చెవులు చిల్లులు పెట్టేస్తున్న స్పీకర్లూ.

"సింవాచెలం గెలవక యింకెవడు గెలుస్తాడు?"

"ఇంకెవడు గెల్చినా పొడిచి పేగుల్లాగేస్తా!"

"ఆడి రక్తం తాగేస్తా!...."

సారాకంపు పెదాలెన్నో సింహాచలం ప్రతిభను అదేపనిగా పొగడ సాగినయ్!

* *

"యస్, మిసెస్. సిన్హా స్పీకింగ్...."

"డాక్టర్ రావ్ హియర్...." అంటూ ఏదేదో మాట్లాడేడు రావ్. ఆఖర్న 'థేంక్యూ, థేంక్యూ!' అన్నాడు. అలాగే డాక్టర్ రావ్ మిసెస్. దీపారావ్‌కూ, మిస్టర్ భట్టాచార్యకూ కూడా ఫోన్లు చేసేడు. అందరూ 'షూర్ షూర్' అన్నట్టున్నారు, వారికి జవాబుగా




'థేంక్యూ' అన్నాడు డాక్టర్ రావు. రెండు గంటలసేపు రావు అలా ఫోన్లు చేస్తూనే వున్నాడు. ప్రతిసారీ సంభాషణలో 'రాజు' ఎలక్షను విషయం దొర్లుతూనే ఉంది. అవతలి నుంచి 'షూర్' అనే హామీ వినబడ్తూనే ఉంది. 'థేంక్యూ' అనుకొని మరో నెంబరు డయల్ చేస్తూనే ఉన్నాడు డాక్టర్ రావ్.

చాలాసేపొయ్యాక ఓ నెంబరు తిప్పాడు రావ్.

"పీ. పీ. రాజ్ అండ్ కో" అని జవా బొచ్చింది.

"హాయ్ రాజూ, దిసీజ్ రావ్; నే చెయ్య వలసినదంతా అయిపోయింది. వీధివీధికీ తిరగ కుండానే ఆయా వీధుల్లో ఉండే రకరకాల వీధి పెద్దలందరి దగ్గరా మాట పుచ్చుకున్నాను. ఇక్కడి కొచ్చి బట్టల కొట్లులూ, మోటారు స్పేరుపార్టు షాపులూ, మిఠాయి దుకాణాలూ పెట్టుకొని సెటిలైపోయిన బెంగాలోళ్లూ, పాకీస్తాను సాయిబులూ అంతా కూడా నీకే వోటేస్తారు. నో. డోంట్ వర్రీ! గొడవలూ, కొట్లాటలూ లేకుండా తాపీగా వ్యవహారం నడి పించు. జాలరిపేట, రెల్లి వీధిలో ఓట్లు ఖరీదు చేయడం మరోగంటలో పూర్తవుతుంది. ఎలక్షన్ టైముకి ఆఫీసర్ల కార్లన్నీ మన చేతి లోనే ఉంటయ్. సింహాచలంగాడి అనుయాయు లంతా మన కార్లలో వచ్చి పదో పరకో తిని మనకే ఓటిస్తారు. అందుచేత యూ - డోంట్ వర్రీ! కానీ ఒకటి, నువ్వు గ్రేడ్యుయేట్‌వని నే చెప్తున్నా. ఔనను. నీ గత చరిత్ర మీద అందంగా రంగులు వేసేయ్. చదువుకున్నోళ్ళకి ఉద్యోగం లేకపోయినా డిగ్రీమీద గురెక్కువ. అవసర మైన చోట డిగ్రీ ఫీలింగు, కులం ఫీలింగూ, గొప్పా....బీదా ఫీలింగూ పెట్టేస్తుండు. ఈ నాలుగు రోజులూ ఖద్దరు గుడ్డలెయ్. ఓ గాంధీ టోపీ తగిలించు. నో నో—నా మాట విను! ఆ బ్రాందీ షాపు దగ్గర కూర్చోకు. అది మీ మేనల్లుడిదని చెప్పు. ఆఁ? మేనల్లుడు లేడం టావా? మీ పార్ట్‌నర్ దాస్ మీ మేనల్లుడే ప్రస్తుతానికి. నువ్వు పట్టి సంఘసేవకుడివి ప్రస్తుతానిక్కి. రేపు ప్రజానాయకుడివి. ఆనక ఎం. పీ. వి దరిమిలా మినిష్టరువి. డబ్బు గురించి వర్రీఅవకు. నేనున్నాను. గోయెహెడ్, ఎలక్షన్ రోజున వాలంటీర్లగా పనీపాటా లేని పాటకపు జనాన్ని వందలెక్కన కొనేయ్. వాళ్ళ టీ ఖర్చులు, బీడీ ఖర్చులూ భరించు. ముందు రోజు పేదవాళ్ళకి అన్నదానం చేయ్. దీని తాలూకు బోర్డులు మాత్రం ఎక్కువ రాయించు. పాతికో పరకో పోయినా ఫలం దక్కాలి. రేపు నువ్వు గెలిస్తే సరేసరి, అదంతా నీ ప్రతిభేనంటారు. ఓడిపోతే అవమానం నాకూ! జాగ్రత్త, మళ్ళీఓసారి సింహాచలంగాణ్ణి కదిపి చూడు, పదివేలు పడేస్తా, కూర్చోమ్మను, లేదా వాడి ఖర్మ. ఆఁ? విత్ డ్రాయల్ డేట్ అయిపోయిందా, యస్సెస్, ఇంకా క్వొశ్చనే లేదు. ఓ. కే. ఆల్ ద బెస్ట్....సోలాంగ్!" అంటూ ఫోన్ పెట్టేసేడు రావ్.

*                    *


సింహాచలం ఆ నాలుగు రోజులూ జంక్షన్‌లో రాత్రుళ్ళు హరికథలు పెట్టించేడు. తోలుబొమ్మలాటలేర్పాటు చేసేడు. కొంత మంది 'మేళం' పెట్టించమన్నారు. నెగ్గిన రోజున ఒక్క మేళం ఏవిటి, రెండు మూడు మేళాలూ, రికార్డింగు డాన్సులూ ఏర్పాటుచేస్తా నని హామీ ఇచ్చేడు. భారీ ఎత్తున మందు గుండు సామానుకి ఆర్డరిచ్చేడు. చామంతి దండలు మళ్ళీ ఖరీదై పోతవేమోనని ముందే చుట్టు ప్రక్కలి ఊళ్ళకి మనుషుల్ని పంపించి బందోబస్తు చెయ్యించేడు. 'అడగనోడిది పాపం' అన్నట్టుగా అందంగా తయారైన నూకాలు చిరునవ్వు లొలకబోస్తూ 'పుల్‌గళా సులు' అందరికీ అందించేస్తుండేది.

ఎటుచూసినా హడావుడీ, సందడీ; తాగేసి నోళ్ళ పేలుడూ, సింహాచలానికి జై జై లూ!...

"మాఁవా, నువ్........నెగ్గేక........అడు గడుక్కీ....కల్లుపాక తెరిపించీ! పేదోళ్ళకి....ఉచితంగా....కల్లుపోసీ! నువ్వే మా గవరన మింటు....నువ్వే మా సర్కారు....ఆడించు మావా, యింకో గళాసు...."

అందరికీ 'అలాగే' నన్నాడు. కొన్ని కుళా యిల్లో నీళ్ళకి బదులు 'సారా' వచ్చేట్టు చూడ మన్నారు కొందరు మత్తు మైకంలో. అదీ 'సరే' నన్నాడు, గాంధీ టోపీ ధరించిన ఖద్దరు గుడ్డల సింహాచలం. ఇంటింటికీ, గడప గడపకీ హామీలూ, ఒట్లు, ఉపన్యాసాలూ, అభ్యర్ధనలూ.....ఎగస్‌పార్టీవాళ్ళని దుయ్యబట్ట డాలూ........ఎలక్షను టైము గంటల్లో కొచ్చే సింది....

'ఇది కార్మిక వర్గానికీ, ధనిక వర్గానికీ పోటీ!' అని లోకల్ న్యూస్ పేపర్లు హెడ్ లైన్స్ వేసినయ్. సింహాచలం బొమ్మనీ, పి. పీ. రాజ్ బొమ్మనీ అటూ ఇటూ వేసి ఓటర్లకు పరిచయం చేసినయ్ మరికొన్ని పత్రి కల. "సింహాచలం గెలిస్తే అనాదిగా ఈ రెండు వర్గాలకీ జరుగుతున్న పోట్లాటలో, కార్మిక వర్గం గెలవడం ప్రారంభమైనట్టే!" నని ఓ కరస్పాండెంట్ సింహాచలం కొట్లో



కూర్చున్న చాలామంది ముందు 'మందు' తీసుకుంటూ ఉద్ఘాటించాడు.

....రిక్షాలూ, రెండెడ్ల బండ్లూ యిటు బారులు తీర్చి నిల్చున్నయ్. కార్లూ, టాక్సీలూ, ప్రైవేటు బస్సులూ అటువైపు వాళ్ళ తరఫున దూసుకుపోసాగినయ్. పోలింగు బూతులు జనంతో నిండిపోయినయ్. కరపత్రాలు గాలిలో ఎగిరిపోసాగినయ్. ఆడా, మగా, పిల్లా, పెద్దా అంతా బారులు తీర్చి నిల్చున్నారు.

గంటలు నిముషాల్లా దొర్లిపోయినయ్. గొప్పా, పేదా అంతా వోటింగ్ కొచ్చేరు. కారుల్లోనూ, రిక్షాల్లోనూ తిరిగి వెళ్ళిపోయేరు.

"ఇక మన చేతుల్లో పని అయిపోయింది! ఆనక ఆ భగమంతుడి దయ!" అనుకొంటూ చతికిల పడిపోయారు అలిసిపోయిన సింహాచలం అనుయాయులు.

నెగ్గితే ఊరేగింపు ఏర్పాట్లకి పది పదిహేను మంది చాకుల్లాటి కుర్రాళ్ళని పురమాయించేడు సింహాచలం. 'లెక్కింపు దగ్గర మనోళ్ళని ఉంచేట్టు చూడు!' అని అటు కొందర్ని తోలేడు.

సాయంత్రం అయి, చీకటిపడేసరికి హడావుడంతా తగ్గిపోయింది. 'ఎవరు నెగ్గుతారా!' అనేదాని మీద వాగ్వివాదాలు మాత్రం మిగిలిపోయాయ్. కొందరు పందేలు, పైపందాలు కాసుకొన్నారు. 'ఏం జరుగుద్దో చూద్దాం' అని ఫలితం కోసం మున్సిపల్ ఆఫీసుకి పరుగెత్తారు.

*   *

"నాయాళ్ళ-నా సొమ్ముతిని నన్నన్యేయం సేసేసినారు, నాయిల్లు గుల్లైపోనాది; యెదవనా కొడుకులు, ఆడెట్టిన డబ్బు తిని ఆడెంపు మొగ్గినారు. నా దుకాణం నాశనం సేసేరు. యీళ్ళకి పుట్టగతులుండవ్. యీళ్ళ కడుపుల్లో పురుగులట్టి దొలిసేస్తయ్. అభిమానం, కృతజ్ఞతా లేదీ లేబరునాయాళ్ళకి! నేను పోసిన సారా తాగేరు, నే నెట్టిన కూడు తిన్నారు, అన్నీపోయి ఆఖర్న ఆడు సూపిన రూపాయి నోట్లకి బానిసై పోయేరు—యెదవలు...." జంక్షన్ కడ్డంగా నిల్చుని దారినిపోయే వాళ్ళం దర్నీ తిట్టసాగేడు, డిపాజిట్టు గల్లంతైన సింహాచలం.

"నే సెబితే యిన్నావా? కల్లుపోసి వోట్లు ఖరీదు సేస్తానంటే కుదురుద్దా? ఆడినీ యీడినీ మోసం సేసి, మాపీసి కల్లు పాకెట్టేవ్, ఆ కల్లు మదుపెట్టి కవున్సిలేరవుదా మనుకున్నావ్, కల్లు తాగినోడి గుణవేటి? ఆడికి ధరమం, నేయం, మంచీ, సెడ్డా అంటే యేటో ఎరుకవ్వుద్దేటి? అసలు సారాయి గుణవేటి? కల్లు గుణవేటి? మోసం సేసి అవతలోడ్ని, ఆడి సంసారాన్ని మాపీయడమే! అందుకే అందరినీ ఆర్పేసిన నిన్ను ఆ కల్లే, ఆ సారాయే మాపీసింది, తలెత్తుకోనీకండా సేసింది. ఆడ్నీ యీడ్నీ ఆడి పోసుకుంటే యేటి నాభం? నీకు కవున్సిలెరూ వొద్దు, కల్లుపాకావొద్దు, వొళ్ళు దాయకుండా పన్జేసి గవురంగాబతుకు, న్యేయంగాబతుకు, రా....లోపలికొచ్చి తొంగో...." వయసులో చిన్నదైనా, లోకజ్ఞానం ఎక్కువవున్న మనిషిలా మందలిస్తున్న 'నూకాలు' మాటలు విన్న సింహాచలం ఒక్క ఊపులో లోపలి కొచ్చి సారాపీపాలనీ, గాజు గ్లాసుల్నీ అక్కడే ఉన్న బాణాకర్రతో అదేపనిగా బ్రద్దలుకొట్టి, "రానియ్ నాయాళ్ళని! కల్లుకొచ్చినోడి కాళ్ళిరిచీస్తా!" అంటూ కసిగా అరవసాగేడు.

'మోసం చేసినా మంచికే చేసింద'న్న తృప్తితో, చిల్లులుపడ్డ బానల్లోంచి కారిపోతున్న 'నాటుసారా' వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ హాయిగా నిట్టూర్చింది నూకాలమ్మ ఉరఫ్ నూకాలు.

——:o:——